
# రసపిచ్చి

మైనేని
వెంకటరత్నం



చదువు వేరు...సంస్కారం వేరు!

విద్య వేరు...వివేకం వేరు!

—కాదంటారా...విశాలరావులో పాటు... ఒక్కసారి ... ఒక్కసారంటే ఒక్కసారి ప్రయాణం చేయండి... ఆ సంగతి అర్థ మవుతుంది.

అడుగో విశాలరావు!

ఎక్కడికో బయలుదేరినట్లున్నాడు.

మనమూ ... అతనిని అనుసరిద్దాం పదండి!

* * *

విశాలరావు ఇంటర్వ్యూకు బయలు దేరేడు.

ఓ సంచిలో సర్టిఫికెట్లు ... సరంజామా సర్దుకొని తెనాలిలో రైలెక్కి గుంటూరు స్టేషన్‌లో దిగేడు.

గేట్లో టికెట్లు తీసుకొంటూ జనాన్ని బయటికి విడిచిపెడుతున్నారు చెకింగ్ ఆఫీసర్లు,

వాళ్ళని చూడగానే అతని బుర్రలో ఓ పురుగు తొలిచింది. ఓ గమ్మత్తు చెయ్యాలని బుద్ధి పుట్టింది.

'టికెట్ ప్లీజ్!' దాటిపోతున్న విశాలరావును నిలవేసి అడిగేడు టి. సి.

'మామూలెంత?' దురుసుగా అడిగేడు విశాలరావు.

టి. సి. ముఖంలో రంగు మారింది.

'మామూళ్ళు తీసుకొంటే మాత్రం... అంత పబ్లిగ్గానా!... టికెట్ అడిగితే 'మామూలెంత' అని దబాయిస్తాడేమిటి?' కోపం వచ్చినా ... నిభాయించుకొన్నాడు టి. సి.

కోటు జేబులోంచి పెన్సిలూ-రసీదు బుక్కూ తీసి 'ఎక్సెస్' కట్టమని కూర్చున్నాడు

'టిక్కెట్టు లేనివాళ్ళందరి దగ్గరా [illegible] ఆ పాల మనిషిని ఎందుకు విడిచిపెట్టేవ్...ఆ మీసాల మనిషిని అడగలేదేం...అంతా దొంగవేషం!

—త్రోసుకు పోబోయాడు విశాలరావు.

'హేయ్ మిస్టర్...ముందు డబ్బు కట్టి వెళ్ళు!' కబంధుడిలా అడ్డుపడ్డాడు టి. సి...మండిపడుతూ.

'డబ్బు కట్టి వెళ్ళాలా ... ఇదిగో తీసుకో!' అంటూ పర్సు తీశాడు. అందులో వో అరలోనుంచి టికెట్ తీసి టి. సి. చేతిలో పెట్టేడు. వెలావెలా పోయాడు టి. సి. ఉరిమి చూసి దాన్ని టక్కున అందుకొన్నాడు.

పక పక నవ్వేడు విశాలరావు...తెల్లబోయిన అతని ముఖాన్ని చూస్తూ 'భలే గమ్మత్తు చేశాన'ని పొంగిపోయాడు.

తన తెలివికి తానే మురుసుకొంటూ... ఆ ఆనందోన్మాదంతో మెయిన్‌రోడ్డు మీద అడ్డదిడ్డంగా నడవటం మొదలెట్టేడు...

వెనకనుంచి వో ఫియట్ కారు హారన్ మ్రోగిస్తూ ... అతని ప్రక్కనుంచి

దూసుకుపోయింది.

'ఇంకేముంది...మనిషి బస్సు క్రింద పడిపోయాడు!' అనుకొంటూ ఆతురతతో చూడసాగేరు...ఆ చుట్టుప్రక్కల వాళ్ళు.

'అమ్మయ్య...వెంట్రుకవాసిలో తప్పిపోయింది ప్రమాదం!' బ్రతికి బయట పడిన విశాలరావును చూసి నిట్టూర్చారు చివరికి.

వాళ్ళంతా తన వంక సానుభూతిగా చూస్తుంటే...మండింది విశాలరావుకు.

'ఇంత పెద్ద రోడ్డంట ఎటు నడిస్తే నేం...నా యిష్టం!' అనుకున్నాడు తనలో.

లారీ బారుకి అతని వెనుక కారు హారన్లు విన్పిస్తూనే ఉన్నాయి.

రిక్షా గంట గణగణ మ్రోగుతూనే ఉంది.

సైకిల్ బెల్ కొట్టుకుంటూనే ఉంది.

ఊహు ... విశాలరావుకు చీమ కుట్టి నట్లన్నా లేదు.

అతనిలోకం అతనిది!

మొత్తానికి అతని ప్రాణం గట్టిది!

అదంతా చూస్తుంటే మీ గుండె గబగబా కొట్టుకోలేదూ?...దడ దడలాడ లేదూ?

అప్పుడే ఏమయింది?

అసలు కథ ముందుంది!

* * *

ఇంకా అరగంట టైముంది ఇంటర్వ్యూకి.

చాలామంది వచ్చారు అభ్యర్థులు.

ప్రతివాడి ముఖంలోనూ నిరుద్యోగం కల్పించిన నిస్పృహ ఆవరించి ఉంది. 'సెలెక్ట్ అవుతానో లేదో'నని గొప్ప ఆతురత కొట్టవచ్చినట్టు కన్పిస్తూ ఉంది.

విశాలరావుకు ఆ దిగులేం లేదు.

'సమయం వేస్ట్ చేయటం దేనికని' విశాలంగా ఉన్న ఆ ఆవరణలో పచార్లు చేయటం మొదలెట్టేడు.

ఓ చోట 'ఇచట పూలు తుంచరాద'ని ఓ బోర్డు వ్రాసిపెట్టి ఉంది.

'ఏమిటీ నిషేధాలు... సినిమా హాళ్లో, రైళ్లో, బస్సులో అంతటా ఇవే! పొగ త్రాగరాదట!...ముందు సీట్లమీద కాళ్ళు పెట్టరాదట! ... ఆడవాళ్ళ సీట్లల్లో కూర్చోరాదట!'

చిర్రెత్తుకొచ్చింది విశాలరావుకు.

హుటాహుటి ఆ పూల తోటలో జొరబడి...ఓ గులాబీ తుంచితేగానీ అతనికి తృప్తి కలగలేదు.

దాని నాఘ్రాణిస్తూ... వెనక్కు తిరిగే సరికి...ఆ వైపే చూస్తూ చెట్టుక్రింద నిలబడిన ఓ అమ్మాయి కన్పించింది.

అక్కడికి నడిచినయ్ విశాలరావు కాళ్ళు.

ఆనందంతో మెరిసినయ్ విశాలరావు కళ్ళు.

ఆ అమ్మాయికి రెండు జడలు... నొసటి మీద చిన్న రింగు...పెదాలకూ గోళ్ళకూ రంగు...చేతిలో వేనిటీ బ్యాగు... హైహీల్సు ... ఆధునిక నాగరికతకు మోడల్గా ఉంది

ఆమెను చూడగానే ఏదో బోసి... ఎక్కడో లోటుగా ఉన్నట్లనిపించింది అతనికి.

దానిక్కారణం తట్టుక్కున తట్టింది బుర్రలో.

'ఇదిగో పువ్వు!' అన్నాడు ఆ జవరాలిని పలకరిస్తూ.

ఆ అమ్మాయి మిర్రి మిర్రి చూసింది అతనివంక

'అలా చూస్తావేం... ఈ పువ్వు తీసుకొని కుడిపక్క జడలో తురుముకో...ఆ జడ రొమ్ముమీదికి ముందుకి వెయ్... ఇంకా బాగుంటావు...తప్పక సెలెక్ట్ అవుతావు!' అన్నాడు విశాలరావు చొరవ తీసుకొని.

ఆ మాటలకు ఆమె ముఖం ఎర్రబడింది. కాల్చేలా చూసింది...కళ్ళింత చేసుకొని.

ఇక ఇక నవ్వి వెనక్కు తిరిగేడు విశాలరావు.

'భలే ఏడిపించాన'ని తనలో తానే [illegible]కున్నాడు.

'మేనర్లెస్ బ్రూట్!' వెళ్ళిపోతున్న అతనిని చూసి సన్నగా గొణిగింది ఆ అబల ...కసిగా.

అక్కడో వేపచెట్టు ఉంది.

దాని క్రింద ఎవరో నలుగురు రైతు యువకులు గుండ్రంగా కూర్చొని వేరుశెనక్కాయలు తింటున్నారు

వాళ్ళ ముందు పెద్ద కుప్ప పోసి ఉన్నయ్ సెనక్కాయలు,

వాళ్ళ మధ్యచేరి తనూ తినటం మొదలెట్టేడు విశాలరావు...చతికిలబడి.

తెల్లబోయారు ఆ తెల్ల చొక్కా వాళ్ళు...అతని దురాక్రమణకు. గుప్పెడు తిని బాగున్నాయని ఓ కాంప్లిమెంట్ ఇచ్చి అక్కడనుండి లేచాడు విశాలరావు.

'సభ్యత తెలీదు!' అతనంత దూరం పోగానే వ్యాఖ్యానించాడు అందులో ఒకాయన.

ఇంకా నయం...విశాలరావు ఆ మాటలు వినలేదు. విని ఉంటే పెద్ద రభసయి పోయేది అక్కడ!

* * *

'విశాలరావ్!' కేకపెట్టేడు డఫేదారు.

ఆ కేకకు ఆఫీసుపంచలో కూర్చున్న వాళ్ళూ...చెట్లక్రింద లేచి ఉన్నవాళ్ళూ గబగబాలేచి...ఇంటర్వ్యూకి సిద్ధం కావడం మొదలెట్టారు.

కొందరు సర్టిఫికెట్లు సర్దుకుంటున్నారు.

మరికొందరు అక్కడఉన్న అద్దంలో తమ రూపాన్ని సరిదిద్దుకొంటున్నారు.

'విశాలరావ్!' రెండోసారి అరిచాడు డఫేదారు.

ఆవరణచుట్టూ ఓసారి రౌండ్కొట్టి ఆఫీసు వెనక నుండి ... తాపీగా అడుగు వేసుకొంటూ వస్తున్న విశాలరావుకు ఆ కేక విన్పించింది.

'విశాలరావ్!' ఈసారి ఆ బిల్డింగంతా మారుమ్రోగేట్టు గట్టిగా అరిచాడు డఫేదారు.

'ఎందుకట్లా గొంతు చించుకుంటావ్...నాకేం చెవుడు లేదు' అంటూ అడ్డంగా నిలబడిన డఫేదార్ను ప్రక్కకు తోసి...సరాసరి ఆఫీసరు వారి గదిలోకి చొరబడ్డాడు విశాలరావు.

అప్పుడు చూడాలి ఆ డఫేదారు ముఖం!

ఏం చేస్తాడు పాపం...కళ్ళప్పగించి చూస్తూ నిలబడ్డాడు అక్కడే. అతని యిరవైయేళ్ళ సర్వీసులోనూ ... అటువంటి ఘటన జరగటం ఆదే మొదలు.

సంప్రదాయం ప్రకారం 'హుజూర్' అని ముందుగా వెళ్ళి దొరవార్ని సావధానుల్ని చెయ్యాలి. తర్వాత అభ్యర్థిని లోపలికి ప్రవేశపెట్టాలి.

ఇప్పుడది తారుమారయింది.

# రసపిచ్చి

'ఆకలే ఆఫీసరు చండశాసనుడు. ఏం కొంప మునుగుతుందో ఏమో' నని ఎడ బిడ పడసాగేడు ఆ సేవకుడు...భయ పడసాగేడు ఆ సేవకుడు...భయపడుతూ.

దూరంగా ఉన్న కుర్చీ టేబుల్ దగ్గరకు జరిగిన చప్పుడు విని తలెత్తి చూశాడు... ఏదో వ్రాసుకొంటున్న ఆఫీసరు.

'నువ్వేగా విశాలరావ్?' ఆధికార స్వరంతో అడిగేడు ఎదురుగా కూర్చున్న మనిషిని.

జవాబివ్వలేదు విశాలరావు. ఫేన్ తన వైపుకు తిప్పుకొని చెమట ఆర్పుకొంటూ కూర్చున్నాడు.

'ఆ అధికారి తరహా 'కనిపెట్టాల'ని అతని ఆలోచన.

'నీర్కావిచొక్కా... భుజకీర్తుల్లాగూటి మీద మాసికలూ... చిరిగి వ్రేలాడుతున్న జేబూ...దాని నిండా సిరా మరకలూ... జిడ్డోడుతున్న ముఖం...సీరియస్‌గా పెట్టిన ఆ పోజూ చూసి ఆశ్చర్యమేసింది ఆఫీసరుకు.

అప్లికేషన్‌లోని ముత్యాల్లాంటి అక్ష రాలకూ...ఎదురుగా కన్పిస్తున్న ఆ మురికి మనిషికీ ఎక్కడా సామ్యం కన్పించలేదు ఆయనకు.

ఇంకా ఆ దరఖాస్తులో బోలెడన్ని వివరాలున్నాయ్.

'నేను యూనివర్సిటీ ఫస్టును... గోల్డు మెడలిస్టును... సర్టిఫికెట్లు ... ఆర్టిస్టును' అంటూ పెద్ద లిస్టు ఉన్నది దానిలో.

అందుకే ముచ్చటపడి...ముందుగా ఎన్నిక చేసి పిలిపించాడు అతన్ని.

తీరా చూస్తే...ఎదురుగా ఈ మనిషి!

'తానేమైనా పొరపాటు పడ్డానేమో' ననుకొని 'నీ పేరేమి'టని మళ్ళీ అడిగేడు ఆఫీసరు...ఆంగ్లంలో.

అంత వెధవ ప్రశ్న అడుగుతాడనుకో లేదు విశాలరావు.


'పిలిచి పిలిచి ఉద్యోగం ఇవ్వాలంటే... ఏడిపిస్తాడు...! కళ్ళముందు కన్పిస్తుంటే పేరేమిటో... పేరు ... ఆ పేరు...' అను కొంటూ... 'పేపరు వెయిట్‌కింద సర్ది ఉన్న రికార్డును కెలక టం మొదలు పెట్టేడు ...చెప్పకుండా. ఆ కాగితాల్ని గురించి ప్రాణమంతా ఉంది విశాలరావుకు. 'వాటిల్లో రికమెండేషన్ లెటర్లు ఉంటాయనీ...వాటిని బట్టే ఉద్యోగమిస్తారని ... అందులో ఒక్కటి చిక్కితే ఆ ఆఫీసరు అంతుతేల్చ వచ్చనీ' ఇదీ అతని ఊహ.

సర్దిన రికార్డంతా చిందరవందర చేస్తున్న ఆ కోతిపనికి విసుగేసి...వాటిని విశాలరావు చేతిలోనుంచి విసురుగా లాక్కొని యథాస్థానంలో ఉంచాడు ఆఫీసరు.

'నీ అర్హత లేమిటి?' ఈసారి తెలుగులో అడిగేడు మళ్ళీ ... గొంతులోకి కాఠిన్యం తెచ్చుకొని.

తను రెండు పేజీలదాకా అన్ని వివరాలతో వ్రాసి పంపుకొన్న అప్లికేషన్‌లో టిక్కులు పెడుతూ అతగాడు వేస్తున్న ఆ చొప్పదంటు ప్రశ్నలకు కోపం వచ్చింది విశాలరావుకు. అన్నీ దాంట్లోనే ఉన్నాయ్ చూసుకో;' అన్నాడు విరసంగా. అతని పెడసరితనం చూసి అగ్గగుగ్గలమయ్యాడు ఆఫీసరు. జామునుంచీ చూస్తున్నాడు అతని అరాచకాన్ని. డ్రాయరుమీది ప్రతి వస్తువూ కదలించటమే ... కాగితాలన్నీ చిందరవందర చేశాడు...తన కళ్ళజోడు పెట్టుకు చూసుకొన్నాడు...బుడ్డిలో ఎర్ర సిరా గచ్చుమీద పారబోశాడు...ఆఖరుకు ఫేను కూడా తనవైపుకు తిప్పుకొన్నాడు...

— ఇక సహించలేక పోయాడు ఆఫీసరు.



'ఉద్యోగం చేయదల్చుకొనే వచ్చావా?' విశాలరావు ముఖంలోకి ఉరిమిచూసి... ముఖం కందగడ్డ చేసుకొని...హెచ్చరిస్తూ అన్నాడు...విసుగేసి.

'ఇలా అవమానించటానికేనా ఇంటర్వ్యూకి పిల్చింది?' అంతకంటె గట్టిగా ఎదురు తిరిగేడు విశాలరావు.

'చేసే మొహంలాగే ఉంది!' అన డిస్తూ కాలింగ్‌బెల్ నొక్కేడు ఆఫీసరు.

ఆ మాటలతో ఒక్కసారి రెచ్చిపో య్యాడు విశాలరావు.

'వెధవ ఉద్యోగం ఎవడిక్కావాలి... ఇందాకటి నుండి చూస్తున్నాను...చొప్ప దంటు ప్రశ్నలూను నువ్వూ...దణ్ణం పెట్ట లేదని ముఖం మాడ్చుకొన్నావ్...నీ తరహా కనిపెడదామని వేషం మార్చుకొని వచ్చా... ఇదిగో ఈ సంచీలో ఇస్త్రీగుడ్డలు... ఇదిగో సర్టిఫికెట్లు...నాపేరే విశాలరావ్...ఇది ప్రజా ప్రభుత్వం తెలుసా...ఈ టేబుల్ మీద ఉన్నవన్నీ ప్రజలవి...సీటిమీద అందరికీ అధికారం ఉంది...ఇదంతా నీ తాతగాడి ముల్లెంగాదు...అధికార రోగపూరిత బధి రాంధక శవానివి నువ్వు... !' అంటూ ఆవేశంతో అరవటం మొదలెట్టేడు విశాలరావు.

యజమాని కాలింగ్‌బెల్ విని లోనికి వచ్చాడు అప్పుడే డఫేదారు.

'ఈ రాస్కెల్‌ని బయటికినెట్టు!' ఆజ్ఞాపించాడు ఆఫీసరు అతన్ని చూసి.

తను మెడమీద చెయ్యేసి బయటికి నెడుతుంటే...గొంతు మూడో స్థాయికి పెంచి కష్టం వచ్చినట్టు తిట్టి కోప మంతా తీర్చుకున్నాడు విశాలరావు.

'వెధవకి బాగా బుద్ధి చెప్పేను!' ఆ కేకలువిని తన చుట్టూ మూగిన జనానికి తన మనకార్యాన్ని మూడు ముక్కల్లో అందించి...అక్కడి నుండి బజారున పడ్డాడు ఆ పట్టభద్రుడు.

కళ్ళారా చూశారుగా జరిగిందేమిటో! ఇప్పుడు చెప్పండి విశాలరావు జబ్బేమిటి? అలా తెల్లబోతారేం...ఇంకా అర్థంకాలా! అతనికి...అతనికి

రసపిచ్చి! ●